RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:134 | మే 21, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్

6లో




2లో

# వావ్..
## ఫ్యూచర్ ఓరుగల్లు!

**మామునూరు ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్, మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో మారనున్న నగర రూపురేఖలు**

- హైదరాబాద్‌కు దీటుగా రియల్ ఎస్టేట్ హబ్‌గా ఎదుగుదల
- ఆకాశాన్నంటనున్న భూముల ధరలు
- వేలాది ఉద్యోగాలు కల్పించనున్న మెగా ప్రాజెక్టులు
- హైదరాబాద్ ఐటీ ఉద్యోగులు, ఎన్ఆర్ఐల దృష్టి ఇప్పుడు వరంగల్‌పైనే..
- అభివృద్ధిలో పరుగులు.. సామాన్యులకు అందని భూముల ధరలు
- పెట్టుబడిదారుల చూపు ఉత్తర తెలంగాణ వైపు
- ఐటీ, టెక్స్‌టైల్, లాజిస్టిక్స్ రంగాలకు కొత్త ఊపు
- వరంగల్ - హైదరాబాద్ ఎకనామిక్ కారిడార్‌తో పెరుగుతున్న కనెక్టివిటీ
- గ్రామాల నుంచి గ్లోబల్ సిటీ వైపు వరంగల్ ప్రయాణం

చారిత్రక వైభవానికి చిరునామాగా పేరొందిన వరంగల్ ఇప్పుడు అభివృద్ధి పరుగులతో ఉత్తర తెలంగాణ ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందుతోంది. మామునూరు విమానాశ్రయం పునర్నిర్మాణం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్–వరంగల్ ఎకనామిక్ కారిడార్, ఐటీ విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులు నగర భవిష్యత్తును కొత్త దిశగా తీసుకెళ్తున్నాయి. ఈ అభివృద్ధి ప్రభావంతో వరంగల్‌లో భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ఐటీ ఉద్యోగులు, ఎన్ఆర్ఐల దృష్టి ఇప్పుడు ఈ నగరంపై కేంద్రీకృతమవుతోంది. ఒకప్పుడు చారిత్రక గుర్తింపుకే పరిమితమైన వరంగల్.. ఇప్పుడు పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, ఐటీ, రవాణా రంగాల్లో తెలంగాణలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా నిలుస్తోంది.

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి (కృష్ణ)



# నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

- తొలి పుష్కర స్నానం చేయనున్న కంచి స్వామి, గవర్నర్
- లక్షలాది భక్తుల కోసం భారీ ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు

3లో





## ఉద్దేశపూర్వక ఆరోపణలు చేస్తున్నారు

బీజేపీని లక్ష్యంగా చేసుకుని రాజకీయ దాడులు చేస్తున్నారు

- ప్రత్యర్థి పార్టీలకు ప్రజల్లో ఆదరణ తగ్గింది
- అందుకే ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని
- కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించాను
- విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాంస్పష్టం
- పోక్సో కేసుపై స్పందించిన బండి సంజయ్

3లో

## కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల మృత్యువాత

- ఆటాడుకుంటూ నీటిలోకి..
- లోతు ఎక్కువగా ఉండడంతోప్రమాదం
- జగిత్యాల జిల్లా కొండపూర్‌లో విషాదం

7లో

# భానుడి భగభగ

### తెలుగు రాష్ట్రాల్లో ఓ రేంజ్‌లో సూర్య ప్రతాపం

- తెలంగాణలో నిర్మల్ 46.5 డిగ్రీలతో ఉక్కపోత
- పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీలు నమోదు
- మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రతపై హెచ్చరికలు
- వడదెబ్బ బారిన పడుతున్న కూలీలు, వృద్ధులు

3లో



# జిల్లాలకూ ఐటీ విస్తరణ

## హైదరాబాద్‌కే పరిమితం కావొద్దు..

- జీసీసీలు, డేటా సెంటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ పనులు వేగవంతం చేయాలి
- తెలంగాణను పెట్టుబడులు, సాంకేతికత కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జిల్లాల్లో ఉద్యోగ అవకాశాల పెంపుపై దృష్టి
- పెట్టుబడిదారులకు ప్రత్యేక ఎస్కార్ట్ అధికారుల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాలకు టి–ఫైబర్ అనుసంధానం

3లో



# వేద న్యూస్

www.vedhanews.in

గురువారం మే 21, 2026







# వావ్.. ఫ్యూచర్ ఓరుగల్లు!

## మామునూరు ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్, మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో మారనున్న నగర రూపురేఖలు

- హైదరాబాద్‌కు దీటుగా రియల్ ఎస్టేట్ హబ్‌గా ఎదుగుదల
- ఆకాశాన్నంటనున్న భూముల ధరలు
- వేలాది ఉద్యోగాలు కల్పించనున్న మెగా ప్రాజెక్టులు
- హైదరాబాద్ ఐటీ ఉద్యోగులు, ఎన్ఆర్ఐల దృష్టి ఇప్పుడు వరంగల్‌పైనే
- అభివృద్ధిలో పరుగులు.. సామాన్యులకు అందని భూముల ధరలు
- పెట్టుబడిదారుల చూపు ఉత్తర తెలంగాణ వైపు
- ఐటీ, టెక్స్‌టైల్, లాజిస్టిక్స్ రంగాలకు కొత్త ఊపు
- వరంగల్ - హైదరాబాద్ ఎకనామిక్ కారిడార్‌తో పెరుగుతున్న కనెక్టివిటీ
- గ్రామాల నుంచి గ్లోబల్ సిటీ వైపు వరంగల్ ప్రయాణం

ఉత్తర తెలంగాణ గుండెకాయగా పేరొందిన వరంగల్ మహానగరం ఇప్పుడు కొత్త ఆర్థిక యుగంలోకి అడుగుపెడుతోంది. ఒకప్పుడు చారిత్రక కట్టడాలు, విద్యాసంస్థలు, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతో గుర్తింపు పొందిన ఈ నగరం.. ఇప్పుడు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక విస్తరణ, రవాణా కనెక్టివిటీ, ఐటీ పెట్టుబడులతో తెలంగాణలో రెండో అతిపెద్ద ఆర్థిక కేంద్రంగా ఎదగడానికి వేగంగా పయనిస్తోంది. ముఖ్యంగా మామునూరు విమానాశ్రయం పునర్నిర్మాణం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్–వరంగల్ ఎకనామిక్ కారిడార్ వంటి ప్రాజెక్టులు నగర భవిష్యత్తును పూర్తిగా మార్చబోతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాల ప్రభావం ఇప్పుడు స్పష్టంగా రియల్ ఎస్టేట్ రంగంలో కనిపిస్తోంది. హనుమకొండ, కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, హసన్‌పర్తి, గీసుకొండ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఐటీ ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు వరంగల్ వైపు ఆసక్తిగా చూస్తున్నారు. ఒకప్పుడు తక్కువ ధరలకు లభించిన గ్రామీణ ప్రాంత భూములు ఇప్పుడు కోట్ల రూపాయల విలువ పలుకుతున్నాయి.


వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి (కృష్ణ)

9701923260


### మామునూరు ఎయిర్‌పోర్ట్‌తో కొత్త ఊపు

వరంగల్ అభివృద్ధి చరిత్రలో అత్యంత కీలకమైన మలుపుగా మామునూరు విమానాశ్రయం పునర్నిర్మాణాన్ని భావిస్తున్నారు. దశాబ్దాలుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మళ్లీ వేగం అందుకుంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన 953 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి అప్పగించింది. దీంతో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి తదుపరి ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఇక ఈ ప్రాజెక్టుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చిన అంశం ఏమిటంటే.. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన టెక్నికల్ సపోర్ట్, సూపర్వైజింగ్ బాధ్యతలను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కు అప్పగించడం. దేశవ్యాప్తంగా పేరొందిన సాంకేతిక విద్యాసంస్థ అయిన వరంగల్ ఎన్ఐటీ భాగస్వామ్యం కావడంతో ప్రాజెక్టుపై మరింత నమ్మకం పెరిగింది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే వరంగల్‌కు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో కనెక్టివిటీ పెరుగుతుంది. పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఎగుమతుల రంగం, పర్యాటక రంగం అన్నీ ఒకేసారి లాభపడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు ఇది గేమ్ చేంజర్ ప్రాజెక్ట్‌గా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



### ఐటీ హబ్‌గా మారే అవకాశాలు

తెలంగాణ ప్రభుత్వం వరంగల్‌ను రాష్ట్రంలో రెండో అతిపెద్ద ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఐటీ టవర్ ఏర్పాటు, సాఫ్ట్‌వేర్ కంపెనీల రాక, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి వంటి చర్యలు ప్రారంభమయ్యాయి. మడికొండ, రాంపూర్ ప్రాంతాల్లో ఐటీ సెజ్‌లు, పరిశ్రమల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఉండటంతో ఈ ప్రాంతాలు పెట్టుబడులకు హాట్‌స్పాట్‌లుగా మారుతున్నాయి. మెరుగైన రోడ్లు, విమానాశ్రయం, పరిశ్రమల వృద్ధి కలిపి వరంగల్‌ను ఐటీ, ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఎకానమీగా మార్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ఓఆర్ఆర్‌తో భూముల ధరలకు రెక్కలు

వరంగల్ మహానగర అభివృద్ధి సంస్థ ప్రతిపాదించిన ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు కావడం రియల్ ఎస్టేట్ రంగంలో భారీ మార్పులకు దారి తీసింది. ముఖ్యంగా ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట, మడికొండ, రాంపూర్ ప్రాంతాల్లో భూముల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అంచనాల ప్రకారం కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ సంవత్సర కాలంలోనే 12 నుంచి 15 శాతం వరకు పెరిగింది. గతంలో గజానికి కొన్ని వేల రూపాయలుగా ఉన్న ధరలు ఇప్పుడు లక్షల రూపాయలకు చేరుకున్నాయి. ముఖ్యంగా హనుమకొండ, మడికొండ ప్రాంతాల్లో గజం ధర రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ఓఆర్ఆర్ పూర్తయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట మధ్య ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడమే కాకుండా పరిశ్రమలకు, లాజిస్టిక్స్ రంగానికి భారీ ఊతం లభిస్తుంది. హైదరాబాద్–వరంగల్ హైవేపై ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.



### హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయ నగరంగా..

ఇప్పటి వరకు తెలంగాణలో రియల్ ఎస్టేట్ అంటే హైదరాబాద్ అనే భావన ఉండేది. కానీ ఇప్పుడు వరంగల్ కూడా అదే దిశగా వేగంగా దూసుకుపోతోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో పెట్టుబడిదారులు ప్రత్యామ్నాయ నగరాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ జాబితాలో వరంగల్ ముందంజలో నిలుస్తోంది. ప్రస్తుతం వరంగల్ పరిధిలో సుమారు 350కి పైగా కొత్త నివాస ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు వేగంగా పెరుగుతున్నాయి. స్థానిక వ్యాపారవేత్తలతో పాటు హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు, విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు కూడా వరంగల్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.






### పెరగనున్న భూముల ధరలు.. సామాన్యుల్లో ఆందోళన

అయితే ఈ అభివృద్ధి మరోవైపు ఆందోళనకూ కారణమవుతోంది. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాలకు స్థలం కొనుగోలు చేయడం కష్టమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో వ్యవసాయ భూములు వేగంగా కమర్షియల్ ఆస్తులుగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు, అనుమతుల్లేని లే అవుట్లు కూడా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేయాల్సిన అవసరం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు సూచిస్తున్నారు.

### ఉత్తర తెలంగాణ భవిష్యత్తును మార్చే కేంద్రంగా..

మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఓఆర్ఆర్, ఐటీ విస్తరణ, ఎకనామిక్ కారిడార్ కలిసి వరంగల్‌ను తెలంగాణలో అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా నిలబెడుతున్నాయి. ఒకప్పుడు చారిత్రక నగరంగా మాత్రమే గుర్తింపు పొందిన వరంగల్.. ఇప్పుడు పరిశ్రమలు, ఐటీ, విద్య, రవాణా, రియల్ ఎస్టేట్ రంగాల్లో భారీ అవకాశాల నగరంగా మారుతోంది. రాబోయే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే వరంగల్ రూపురేఖలు పూర్తిగా మారిపోవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో పెట్టుబడిదారులు అత్యంత ఆసక్తిగా చూస్తున్న నగరంగా వరంగల్ నిలవడం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది.

### కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పారిశ్రామిక విప్లవం

గీసుకొండ మండలం చౌటపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వరంగల్ ఆర్థిక వ్యవస్థకు మరో భారీ బలంగా మారనుంది. రూ.1,695 కోట్ల వ్యయంతో 1,320 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పార్క్ దేశంలోనే తొలి ఫంక్షనల్ టెక్స్‌టైల్ పార్క్‌గా గుర్తింపు పొందింది. టెక్స్‌టైల్ రంగానికి సంబంధించిన స్పిన్నింగ్, వీవింగ్, డైయింగ్, గార్మెంట్స్, ఎగుమతులు వంటి అన్ని కార్యకలాపాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఈ పార్క్‌ను రూపకల్పన చేశారు. దీని వల్ల వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. ముఖ్యంగా గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు, టెక్స్‌టైల్ కంపెనీలు ఈ ప్రాంతంలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. విమానాశ్రయం, ఎకనామిక్ కారిడార్, రైల్వే కనెక్టివిటీ కలిసొస్తే వరంగల్ దక్షిణ భారత టెక్స్‌టైల్ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

### రవాణా, కనెక్టివిటీతో వేగవంతమైన వృద్ధి

హైదరాబాద్–వరంగల్ ఎకనామిక్ కారిడార్, ఎన్‌హెచ్–163 విస్తరణ పనులు వరంగల్ అభివృద్ధికి మరింత ఊతమిస్తున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పరిశ్రమలు, గిడ్డంగులు, లాజిస్టిక్స్ కేంద్రాలు ఏర్పడే అవకాశాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణ సమయం తగ్గడం, భవిష్యత్తులో వేగవంతమైన రైల్వే కనెక్టివిటీ రావడం, విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వరంగల్‌ను ప్రాంతీయ వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దనున్నాయి





# ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేస్తున్నారు

- బీజేపీని లక్ష్యంగా చేసుకుని రాజకీయ దాడులకు తెగబడుతున్నారు
- ప్రత్యర్థి పార్టీలకు ప్రజల్లో ఆదరణ తగ్గింది
- అందుకే ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని
- కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించాను
- విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాం
- పోక్సో కేసుపై స్పందించిన బండి సంజయ్



**వేద న్యూస్, హైదరాబాద్**

పోక్సో కేసు వ్యవహారంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు సంబంధిత కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చట్ట ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలనే ఉద్దేశంతో స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. తాను ఎలాంటి వ్యక్తినో తమ పార్టీ కార్యకర్తలకు బాగా తెలుసని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సంఘటనలు రాజకీయాల్లో చాలా అరుదుగా ఉంటాయని వ్యాఖ్యానించారు. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని, చట్టపరమైన ప్రక్రియకు సహకరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తల గురించి కూడా ఆయన మాట్లాడారు. బీజేపీలో ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసే వ్యక్తేనని పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు తమ జీవితాన్ని సిద్ధాంతాలకు అంకితం చేస్తారని అన్నారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలపై స్పందించిన బండి సంజయ్, తనపై కొన్ని పార్టీలు ఉద్దేశపూర్వక ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తమ పార్టీని లక్ష్యంగా చేసుకుని రాజకీయ దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇతర పార్టీల నాయకులు తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని చేస్తున్న డిమాండ్లపై కూడా ఆయన స్పందించారు. ప్రత్యర్థి పార్టీలకు ప్రజల్లో ఆదరణ తగ్గిందని, అందుకే ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కె. చంద్రశేఖర్ రావు కుటుంబ పాలనపై కూడా విమర్శలు చేశారు. తమ పార్టీ ఆ కుటుంబ పాలనను ఎదుర్కొని ప్రజల ముందుకు తీసుకు వచ్చిందని, అందుకే తమపై అసత్య ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. అయితే ఈ వ్యవహారంపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# జంట హత్యల కేసులో ఉరిశిక్ష

- నిందితుడికి మరణించే వరకు ఉరిశిక్ష
- పక్కా సాక్ష్యాలతో కేసు ఛేదించిన పోలీసులు
- పాశవిక హత్యల కేసులో కీలక తీర్పు



**వేద న్యూస్, వరంగల్**

వరంగల్ జిల్లాలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అత్యంత పాశవికంగా జరిగిన ఈ ఘటనలో నిందితుడికి మరణించే వరకు ఉరిశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జె. మైత్రేయి తీర్పు ఇచ్చారు. ఈ ఘటన రెండువేల ఇరవై నాలుగు జూలై పదో తేదీ అర్ధరాత్రి సమయంలో చెన్నారావుపేట మండలం చింతల తండాలో చోటుచేసుకుంది. గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీ, చింతల తండాకు చెందిన దీపికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో దీపిక తన పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్యను తన నుంచి దూరం చేశారనే అనుమానంతో నాగరాజు తీవ్ర కక్ష పెంచుకున్నట్లు విచారణలో తేలింది. ఆగ్రహంతో అర్ధరాత్రి సమయంలో దీపిక ఇంటికి వెళ్లిన నిందితుడు కత్తితో కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో దీపిక తల్లి సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె తండ్రి శ్రీను తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. దీపిక, ఆమె సోదరుడు మదన్ తీవ్ర గాయాలపాలైనా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన అప్పట్లో జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఘటన అనంతరం పోలీసులు దర్యాప్తు చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న నెక్కొండ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందం కీలక ఆధారాలు సేకరించింది. సాక్ష్యాలు, వాంగ్మూలాలు, ఇతర ఆధారాలతో సమగ్ర చార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. బాధితుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి బలమైన వాదనలు వినిపించారు. నిందితుడి చర్య అత్యంత క్రూరమైనదని, సమాజంలో ఇటువంటి నేరాలకు కఠిన శిక్షలు అవసరమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అనంతరం న్యాయస్థానం ఈ నేరాన్ని అత్యంత దారుణమైన కేసుగా పరిగణించింది. ఇటువంటి నేరగాళ్లకు సమాజంలో స్థానం లేదని పేర్కొంటూ నిందితుడు నాగరాజుకు మరణించే వరకు ఉరిశిక్ష అమలు చేయాలని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నేరాల నియంత్రణకు ఇటువంటి కఠిన తీర్పులు దోహదపడతాయని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# జిల్లాలకూ ఐటీ విస్తరణ

**వేద న్యూస్, హైదరాబాద్**



తెలంగాణలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు చూపుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, జీసీసీలను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా జిల్లాలకు కూడా విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఒకే నగరానికి పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని అధికారులకు సూచించారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం ప్రత్యేక విధానం రూపొందించాలని, ముఖ్యంగా హైదరాబాద్‌కు బయట ప్రాంతాల్లో పెట్టుబడులు వచ్చేలా కొత్త ప్రోత్సాహకాలు తీసుకురావాలని సీఎం ఆదేశించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారుల వెంట ఐటీ సంస్థలకు అనువైన ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు. ఐటీ రంగాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 'బియాండ్ కోర్ అర్బన్ రీజియన్' ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అభివృద్ధి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించడంతో పాటు జిల్లాల్లో ఉపాధి అవకాశాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే నెట్–జీరో విధానాలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదించిన ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రపంచ స్థాయి సాంకేతిక సదుపాయాలతో అత్యాధునిక నగరంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అలాగే ఇండస్ట్రియల్ కారిడార్‌లో కంపెనీల స్థాపనకు అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. పెట్టుబడులను మరింత ప్రోత్సహించేందుకు "ఇన్వెస్ట్ తెలంగాణ" పేరిట ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. పెట్టుబడిదారులకు మొదటి దశ నుంచి ప్రాజెక్టు ప్రారంభం వరకు సహాయపడే విధంగా ప్రత్యేక ఎస్కార్ట్ అధికారులను నియమించాలని తెలిపారు. మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను టి–ఫైబర్ ఇంటర్నెట్ సేవలకు అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రైవేట్ నెట్‌వర్క్‌లపై ఆధారపడకుండా ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులు, సాంకేతికత, ఉద్యోగ అవకాశాల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దూకుడుగా ముందుకెళ్తోందని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌కే పరిమితం కావొద్దు..

- జీసీసీలు, డేటా సెంటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ పనులు వేగవంతం చేయాలి
- తెలంగాణను పెట్టుబడులు, సాంకేతికత కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జిల్లాల్లో ఉద్యోగ అవకాశాల పెంపుపై దృష్టి
- పెట్టుబడిదారులకు ప్రత్యేక ఎస్కార్ట్ అధికారుల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాలకు టి–ఫైబర్ అనుసంధానం

# నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

**వేద న్యూస్, కాళేశ్వరం**



తెలంగాణలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మే 21 నుంచి జూన్ 1 వరకు పన్నెండు రోజుల పాటు కాళేశ్వరంలో ఈ పుష్కర వేడుకలు జరగనున్నాయి. ఈ మహోత్సవానికి ముప్పై నుంచి నలభై లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. పుష్కరాల ప్రారంభ వేడుకలు ఆధ్యాత్మిక వైభవంతో జరగనున్నాయి. తొలి రోజైన మే 21న తెల్లవారుజామున ఐదు గంటల నలభై మూడు నిమిషాలకు శ్రీ విజయేంద్ర సరస్వతీ, శివ ప్రతాప్ శుక్లా పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గతంలో నిర్వహించిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల వద్ద చలువ పందిళ్లు, కాయర్ మ్యాట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తుల రవాణా సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఘాట్ పరిసరాల్లో ఇరవై మూడు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం ముప్పై కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తొంభై షటిల్ బస్సులను అందుబాటులో ఉంచారు. పుష్కర ఘాట్ నుంచి ఆలయాల వరకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారుల అభివృద్ధి పనులు కూడా చేపట్టారు. భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఘాట్లు, ఆలయాలు, పార్కింగ్ ప్రాంతాల్లో రెండు వందల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే వంద మంది ప్రత్యేక శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను నియమించారు. సెఫ్టీ బోట్లు, లైఫ్ రింగులు, ప్రత్యేక రక్షణ బృందాలు, విపత్తు నిర్వహణ సిబ్బంది సిద్ధంగా ఉండనున్నారు. వైద్య సేవల కోసం ఇరవై మూడు జోన్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మూడు వందల మంది వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది సేవలు అందించనున్నారు. ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు సిద్ధంగా ఉంచగా, మహాదేవపూర్ ఆరోగ్య కేంద్రాన్ని రిఫరల్ ఆసుపత్రిగా గుర్తించారు. భక్తుల సౌకర్యార్థం ఐదు వందల టాయిలెట్లు ఏర్పాటు చేశారు. రెండు తాగునీటి నిల్వ కేంద్రాలను నిర్మించారు. పార్కింగ్ ప్రాంతాల్లో కూడా తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. పుష్కరాల పన్నెండు రోజుల పాటు మూడు వందల మంది పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం సేవలు అందించనున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మ్యూజియం కూడా ఏర్పాటు చేస్తున్నారు. నాగేంద్ర స్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ప్రతిరోజూ హోమాలు, హారతులు, తెప్పోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ ఒక ప్రముఖ పీఠానికి చెందిన స్వామిజీ పుష్కరాల్లో పాల్గొని పుణ్యస్నానాలు చేయనున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం మధ్య జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలు భక్తులకు మరపురాని అనుభూతిని అందించనున్నాయని అధికారులు తెలిపారు.

# తెలంగాణకు అదనపు నిధుల కేటాయించండి

- మూలధన వ్యయాలకు ప్రత్యేక సహాయం చేయండి
- విద్యా రంగానికి భారీ పెట్టుబడులు అందించండి
- కేంద్రానికి భట్టి కీలక వినతి



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ విస్తరణకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ను కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, విద్యా రంగ పెట్టుబడులపై కీలక చర్చలు జరిపారు. ప్రత్యేక సహాయ పథకం కింద తెలంగాణకు అదనంగా ఐదు వేల కోట్ల రూపాయల ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని భట్టి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని వివరించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ గత కొన్నేళ్లలో ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా తీసుకున్న అప్పుల భారం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని తెలిపారు. యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాలల ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. జిల్లాల వారీగా కొత్త వైద్య కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతంపై దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యా రంగ రూపాంతరానికి రాష్ట్ర ప్రభుత్వం ముప్పై వేల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇందులో వంద ఐదు సమగ్ర నివాస పాఠశాలల నిర్మాణంతో పాటు ప్రభుత్వ కళాశాలలు, సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధి కూడా భాగంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను రాష్ట్ర ఆర్థిక పరిమితుల నుంచి మినహాయించాలని కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి కోరారు. ఇవి సాధారణ ఖర్చులు కాకుండా భవిష్యత్ తరాల విద్యా సాధికారత కోసం చేపడుతున్న దీర్ఘకాలిక పెట్టుబడులని వివరించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ విద్యా, మౌలిక వసతుల పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని భట్టి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తగిన మద్దతు అందిస్తే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

## ఓ రేంజ్‌లో సూర్య ప్రతాపం

- నిర్మల్ లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీలు నమోదు
- మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రతపై హెచ్చరికలు
- వడదెబ్బ బారిన పడుతున్న కూలీలు, వృద్ధులు



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో భానుడు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో కూడా వేడి తీవ్రత కొనసాగనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురం పరిధిలోని నందనమారెళ్లలో 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో కూడా ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. నిర్మల్‌లో 46.5 డిగ్రీలు నమోదు కాగా, హనుమకొండలో 46.4 డిగ్రీలు, జగిత్యాలలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో తీవ్రమైన వడగాలులపై ఎర్ర హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో వేడి గాలులతో పాటు ఉక్కపోత కూడా ప్రజలను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వడగాలుల ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు తేమ శాతం కూడా పెరగడంతో ప్రజలు మరింత అసౌకర్యానికి గురయ్యే అవకాశముందని పేర్కొంది. రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికపాటి దుస్తులు ధరించడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్యశాఖ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా కూడా తీవ్రమైన వేడి పరిస్థితులు కొనసాగుతున్నట్లు వాతావరణ సంస్థలు వెల్లడిస్తున్నాయి.

వేద న్యూస్

గురువారం మే 21 , 2026

# ధర్మారంలో మూతబడ్డ మెడికల్ షాపులు

**వేద న్యూస్, ధర్మారం:**



ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా మందుల విక్రయాలను నిరసిస్తూ బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్‌కు ధర్మారం మండల కేంద్రంలోని ఫార్మసీలు పూర్తి మద్దతు ప్రకటించాయి. ఫార్మసిస్టులు, మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. కరోనా సమయంలో తాత్కాలికంగా కల్పించిన వెసులుబాటును ఆసరాగా తీసుకుని ఆన్‌లైన్ సంస్థలు ఎలాంటి నియంత్రణలు లేకుండా మందుల విక్రయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రిస్క్రిప్షన్ తనిఖీలు లేకుండా మందులు సరఫరా కావడం వల్ల నకిలీ మందులు ప్రజలకు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆన్‌లైన్ సంస్థల కారణంగా స్థానిక ఫార్మసీల జీవనోపాధి దెబ్బతింటోందని వ్యాపారులు పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అత్యవసర సేవల కోసం కొన్ని మెడికల్ షాపులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ధర్మారం మండల కేంద్రంలో మెడికల్ షాపులు మూతపడటంతో వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఆన్‌లైన్ ఔషధ విక్రయాలపై ప్రభుత్వం కఠిన నియంత్రణలు విధించాలని ఫార్మసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

- నార్కోటిక్ జాగిలంతో కిరాణా, పాన్ షాపుల పరిశీలన
- మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసుల హెచ్చరిక



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలం సహాయంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

# జనగణన సర్వేలో నిబంధనల ఉల్లంఘన

- ఎన్యూమరేటర్ స్థానంలో సీఆర్పీతో విధులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో జనగణన సర్వే నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనగణన కోసం నియమించిన ఎన్యూమరేటర్ స్థానంలో సిఆర్పితో విధులు నిర్వహింపజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కృష్ణ మందిరం నుంచి అంబం గల్లీ వరకు సర్వే బాధ్యతలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ క్లర్క్‌కు అప్పగించగా, ఆమె ఇంటింటికి వెళ్లకుండా విద్యాశాఖలో పనిచేస్తున్న సిఆర్పితో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. సిఆర్పీలు జనగణన విధులు నిర్వహించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వేములవాడలో మెడికల్ షాపుల బంద్

- అత్యవసర మందుల కోసం ప్రజల ఇబ్బందులు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**




ఆన్‌లైన్ మందుల విక్రయాలకు వ్యతిరేకంగా తెలంగాణ డ్రగ్గిస్ట్ అండ్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు వేములవాడ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఫార్మసీలు పూర్తి మద్దతు ప్రకటించాయి. బుధవారం ఉదయం నుంచే మెడికల్ షాపులు స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. కార్పొరేట్ ఆన్‌లైన్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో సంప్రదాయ మెడికల్ షాపుల వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయని ఫార్మసీ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏఐ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్లతో యాంటీబయాటిక్స్, మత్తు మందులు సులభంగా లభిస్తున్నాయని, ఇది ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందని హెచ్చరించారు కోవిడ్ సమయంలో అమల్లోకి వచ్చిన తాత్కాలిక హోమ్ డెలివరీ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ షాపులు మూతపడటంతో బీపీ, షుగర్ మందులు, అత్యవసర ఇంజెక్షన్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే అత్యవసర సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ షాప్‌తో పాటు కొన్ని ఎమర్జెన్సీ ఫార్మసీలు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# ధాన్యం నిల్వకు గోదాంలను సిద్ధం చేయాలి

- వాహనాలు, హమాలీల సంఖ్య పెంచాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు అందుబాటులో ఉన్న గోదాంలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ, గోదాంల వినియోగం, బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంపు, మిల్లుల్లో అన్‌లోడింగ్, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై బుధవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, చివరి గింజ వరకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తూకం వేసిన బస్తాలను వెంటనే తరలించేందుకు సరిపడా వాహనాలు సమకూర్చాలని, హమాలీల సంఖ్య పెంచి లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్‌లైన్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని, వచ్చే సీజన్‌లో సన్న రకం వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అకాల వర్షాల దృష్ట్యా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# బొక్కలతండలో విద్యుత్ వెలుగులు

- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు రాత్రికిరాత్రే ప్రత్యామ్నాయం

**వేద న్యూస్, కారేపల్లి:**




బజ్యాతండ గ్రామపంచాయతీ పరిధిలోని బొక్కలతండలో ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో గ్రామం అంధకారంలో మగ్గింది. తీవ్ర ఎండల మధ్య విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రాత్రి 11 గంటల సమయంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామంలో మళ్లీ విద్యుత్ వెలుగులు నిండాయి. అత్యవసర పరిస్థితిలో ఆలస్యం చేయకుండా స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. రాత్రివేళల్లోనే పనులు పూర్తి చేయడం బాధ్యతాయుత సేవలకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు, ఏఈ వెంకన్న, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడలో రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొని పలువురికి గాయాలు
- డివైడర్‌పైకి ఎగిరిపడ్డ గూడ్స్ వాహనం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**




వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఆర్టీసీ బస్సు, అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం బలంగా ఢీకొనడంతో గూడ్స్ వాహనం డివైడర్‌పైకి ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో తొలి సంస్కార శాలకు విశేష స్పందన

- దేవరకద్రలో వినూత్న కార్యక్రమం చేపట్టిన పవన్ కుమార్ రెడ్డి
- చిన్నారుల్లో సంస్కృతి, నైతిక విలువల పెంపుకు ప్రత్యేక శిక్షణ

**వేద న్యూస్, దేవరకద్ర:**



తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా దేవరకద్రలో నిర్వహిస్తున్న “సంస్కార శాల” ప్రత్యేక శిక్షణ తరగతులు విశేష ఆదరణ పొందుతున్నాయి. చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీవత్స వైదిక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి సహకారంతో దేవరకద్ర తపోవన్ పాఠశాలలో ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. తెలంగాణలోనే తొలిసారిగా ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహించడంపై పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. 9 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం, శారీరక వ్యాయామాలు, మనోవికాసం, భారతీయ సంస్కృతి, నైతిక విలువలపై శిక్షణ అందిస్తున్నారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటుండగా, తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. కాశీ, అయోధ్య నుంచి వచ్చిన విద్వాంసులు మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని తెలిపారు. సంస్కార శాల ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక భావనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేష్, కొండ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన సర్పంచ్

- వృద్ధులు, వికలాంగులకు పండ్లు, తాగునీరు పంపిణీ

**వేద న్యూస్, కారేపల్లి:**



మండుతున్న ఎండల్లో పెన్షన్ కోసం వచ్చిన వృద్ధులు, వికలాంగుల పట్ల సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన పెన్షన్ దారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కార్యాలయ ఆవరణలో నీడ ఏర్పాట్లు చేసి, చల్లని తాగునీరు, తాజా పండ్లు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సర్పంచ్ స్వయంగా పర్యవేక్షిస్తూ వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ టోనీ సేవలను వృద్ధులు, మహిళలు అభినందించారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవడం నిజమైన ప్రజాసేవ అని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మే 21 , 2026

# ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలి

- తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్
- జనగణన సర్వే పరిశీలన



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని కొప్పుల, ప్రగతి సింగారం గ్రామాల్లో కొనసాగుతున్న జనగణన గృహాల జాబితా ప్రక్రియను తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా హౌస్ లిస్టింగ్ పనులను పరిశీలించిన ఆయన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం, పూర్తి వివరాలు అత్యంత ముఖ్యమని తహసీల్దార్ పేర్కొన్నారు.

# కురుమూర్తి స్వామి హుండీ ఆదాయం రూ.9.10 లక్షలు

**వేద న్యూస్, చిన్న చింతకుంట:**



ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. చిన్న చింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ధర్మకర్తల చైర్మన్ బత్తుల బాలరాజ్, ఈవో మదినేశ్వర్ రెడ్డి, దేవాదాయ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఒక నెలకు సంబంధించిన హుండీ ఆదాయం రూ.9,10,636 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



**వేద న్యూస్, మహబూబాబాద్:**

మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ జన్మదిన వేడుకలను మహబూబాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే తమ లక్ష్యమని, శంకర్ నాయక్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవలో కొనసాగుతామని తెలిపారు. శంకర్ నాయక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అశోక్ నాయక్, మహ్మద్ రఫిక్, జన్నే నవీన్, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మహిళా రైతు మృతి

- ధాన్యం కేంద్రం నుంచి వచ్చి అస్వస్థత - వట్టిమల్ల గ్రామంలో విషాదం

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో వడదెబ్బకు గురై మహిళా రైతు ఎర్రగడ్డం లచ్చవ్వ (55) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చవ్వ బుధవారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి వచ్చారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఇంటికి చేరుకున్న వెంటనే అస్వస్థతకు గురయ్యారు. అనంతరం వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త లచ్చిరెడ్డి, నలుగురు కుమార్తెలు ఉన్నారు. లచ్చవ్వ అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలంలోని బజ్యాతండ గ్రామపంచాయతీ పరిధిలో బొర్రయ్య కుంట వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనులను సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బొర్రయ్య కుంట అభివృద్ధితో భూగర్భ జలాల స్థాయి పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తుల సృష్టికి దోహదపడుతోందన్నారు. పనుల్లో పాల్గొంటున్న కార్మికులతో మాట్లాడిన సర్పంచ్, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలీల హాజరు, పనుల నాణ్యత, పారదర్శకత విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ధారావత్ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాకు ప్రత్యేక ఆపరేషన్

- నార్కోటిక్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు



**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి:**

గద్వాల్ జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గద్వాల పట్టణంతో పాటు పలు గ్రామాల్లో నార్కోటిక్ జాగిలం "జిమ్మీ" సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు నాశనమవుతుందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసులకు గోప్యంగా సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- గ్రామాల్లో స్వచ్ఛందంగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేష్




**వేద న్యూస్, శాయంపేట:**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ వై. సుధాకర్ రెడ్డి, ఎస్సై జక్కుల పరమేష్ పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాయంపేట మండలంలోని ప్రగతి సింగారం, రాజుపల్లి గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో రూ.50 వేల విలువైన సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కెమెరాల ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించడం, నేరాలను నియంత్రించడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోనపెల్లి రఘుపతి రెడ్డి, రాజుపల్లి సర్పంచ్ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు

- ప్రమాదాలకు కారణం కాకండి
- రైతులకు ఎస్సై అశోక్ సూచన



**వేద న్యూస్, నడికూడ:**

పంట వ్యర్థాలను కాల్చి ప్రమాదాలకు కారణం కాకూడదని దామెర ఎస్సై కొంక అశోక్ రైతులకు సూచించారు. బుధవారం నడికూడ మండలంలోని కంటాత్మకూర్, రామకృష్ణాపూర్ గ్రామాల రైతులతో సమావేశమై అవగాహన కల్పించారు. మంగళవారం రామకృష్ణాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన మొక్కజొన్న పంట వ్యర్థాలకు మంటలు అంటుకోవడంతో పొగలు కమ్ముకున్నాయని, అదే సమయంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఆకారపు క్రాంతి కుమార్‌ను బొలెరో ట్రాలీ వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలపై రైతులకు వివరించారు. ఇకపై పంట వ్యర్థాలను కాల్చబోమని రైతులు ఎస్సైకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, రామకృష్ణాపూర్ సర్పంచ్ పెండ్లి లక్ష్మీరాజు, రైతులు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

- ఆరాధ్య ఫౌండేషన్ సేవలు అభినందనీయం



**వేద న్యూస్, చొప్పదండి:**

మహిళా సాధికారత, స్వయం ఉపాధి లక్ష్యంగా ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ చొప్పదండి మండలంలో నిర్వహిస్తున్న సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. కుట్టు రంగంలో నైపుణ్యాలు పెంపొందించి స్వయం ఉపాధి దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న మహిళలకు డిస్కౌంట్ ధరలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ చిలుముల స్వప్న సమన్వయంతో కార్యక్రమం నిర్వహించగా, ట్రైనింగ్ టీచర్ తమ్మనవేణి కవిత, గ్రామ సర్పంచ్ మామిడి రాజేశం, ఉప సర్పంచ్ కళ్లెం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఫౌండేషన్ చేస్తున్న సేవలను స్థానికులు అభినందించారు.

# తరుగు, తేమ పేరుతో దోపిడీ అరికట్టాలి

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి



**వేద న్యూస్, పరకాల ప్రతినిధి:**

రాష్ట్రంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న జాప్యం, మౌలిక వసతుల కొరత, తరుగుతేమ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పరకాల అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు గాజుల నిరంజన్, కాసగాని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు అందుబాటులో ఉంచి రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగ పురుషోత్తం, గుండెబోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్ రావు, బాబూ యాదవ్, దయ్యాల దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- రైతులకు మద్దతు ధర లభిస్తుంది- పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తి



**వేద న్యూస్, నడికూడ:**

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి సూచించారు. బుధవారం నడికూడ మండలం రాయపర్తి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వజీర్, డీటీ సదానందం, సీఈఓ రాజేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి అభివృద్ధియే మా ధ్యేయం



- మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి
- ఏడో వార్డులో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన

**వేద న్యూస్, ధర్మపురి:**

ధర్మపురి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఏడో వార్డులో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వార్డు సభ్యులు విజయ్ బాబు, చిపిరిశెట్టి రాజేష్, వొజ్జల లక్ష్మణ్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# 50శాతం సబ్సిడీతో జీలుగా విత్తనాల పంపిణీ

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సంఘ అధ్యక్షుడు సంఘమేశ్వర్

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద బుధవారం యాభై శాతం సబ్సిడీతో జీలుగా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు పరుచూరి సంఘమేశ్వర్ రావు మాట్లాడుతూ.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులతో వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద అనుమతి పొందిన తర్వాత రాయకూర్ సంఘంలో రూ. 2452.50 చెల్లించి ముప్పై కిలోల విత్తనాల బస్తాను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు తోట అరుణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ హన్మంత్ రావు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.




# భీమేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.83 లక్షలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం అధికారులు లెక్కించారు. గత 44 రోజుల కాలానికి సంబంధించిన ఆరు హుండీల లెక్కింపులో మొత్తం రూ.83,09,269 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా భక్తులు మొక్కుబడిగా సమర్పించిన 23 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 900 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు తెలిపారు. వేసవి సెలవులు, ప్రత్యేక పూజలు, శుభ ముహూర్తాల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగడంతో భారీగా కానుకలు సమర్పించారని అధికారులు పేర్కొన్నారు. ఆలయ ఈవో రమాదేవి, దేవాదాయ శాఖ ప్రతినిధి రాజమౌళి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, భజన మండలి సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

# అనుమతుల ప్రకారమే చెరువు మట్టి తరలింపు



- ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పనులు

**వేద న్యూస్, రామడుగు:**

ప్రభుత్వ అనుమతులతోనే వెలిచాల గ్రామ పెద్ద చెరువులో మట్టి తరలింపు పనులు చేపట్టినట్లు స్థానిక సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని పెద్ద చెరువులో మట్టి తరలింపు పనులను బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దాదాపు డెబ్బై ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో నుంచి మట్టి తరలింపునకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిర్ణయం మేరకు చేపట్టిన ఈ పనుల ద్వారా వచ్చే ఆదాయాన్ని చెరువు అభివృద్ధికే వినియోగించాలని గ్రామస్థులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే మట్టి తరలింపు పనులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

# కేంద్ర విధానాలతో సామాన్యుడు కుదేలు



- ఇంధన ధరల పెంపు ప్రజలపై భారం
- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... పెట్రోల్, డీజిల్, సిఎన్‌జీ ధరల పెంపు అన్ని రంగాలపై ప్రభావం చూపుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యుడి జీవితం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని చెప్పి, తర్వాత భారాలు మోపడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపించి ధరలు పెంచడం పేదలపై అదనపు భారం మోపడమేనన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన హామీలు అమలు కాలేదని ఆరోపించిన ఆయన, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇంధన ధరల పెంపు మరింత భారంగా మారిందన్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై భారీ పన్నులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ-2026 రద్దు నిర్ణయంపై స్పందిస్తూ, ఇది నోట్ల రద్దును తలపిస్తోందన్నారు. వరుస పేపర్ లీకులతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కేంద్ర ప్రభుత్వ పదేళ్ల పాలనలో 93 పేపర్లు లీక్ అయ్యాయని ఎద్దేవా చేశారు.

# బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ కలకలం

- వైన్స్ షాప్ వద్ద వినియోగదారుల ఆందోళన
- దర్యాప్తు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు




**వేద న్యూస్, సిద్దిపేట:**

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాప్ వద్ద బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ కనిపించడంతో ఉద్రిక్తత నెలకొంది. వైన్స్ షాప్‌లో కొనుగోలు చేసిన బీర్ సీసాలో అనుమానాస్పద వస్తువు కనిపించడంతో మద్యం ప్రియులు ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపిస్తూ వినియోగదారులు ఆందోళనకు దిగారు. కల్తీ మద్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన వారు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత వైన్స్ షాప్ లైసెన్స్ రద్దు చేయాలని కూడా కోరారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని ఫిర్యాదు స్వీకరించారు. ఘటనపై దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకుంది.

# కోటగిరిలో మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**వేద న్యూస్, కోటగిరి:**




ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాల కోసం తీసుకొచ్చిన జీవో నంబర్ 817ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు కోటగిరి, పొతంగల్ మండలాల మెడికల్ షాపుల యజమానులు మద్దతు ప్రకటించి దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి సీతాలే విజయ్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ మందుల అమ్మకాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మెడికల్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు

- పర్యావరణం, భూసారానికి తీవ్ర నష్టం
- మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్




**వేద న్యూస్, చొప్పదండి:**

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణంతో పాటు నేల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ రైతులకు సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పొగ, విషవాయువులు గాలిలో కలిసి కాలుష్యానికి కారణమవుతాయని తెలిపారు. అలాగే నేలలోని సూక్ష్మ జీవులు, పోషకాలు నాశనమై భూసారం తగ్గిపోతుందని పేర్కొన్నారు. పంట వ్యర్థాలను రోటవేటర్‌తో కలియ దున్ని డీ కంపోజర్లు చల్లడం ద్వారా తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఒక ఎకరాకు సుమారు రూ.300 ఖర్చుతో ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చన్నారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించాలని సూచించారు.

# మెడికల్ షాపుల బంద్ సంపూర్ణం

**వేద న్యూస్, పరకాల ప్రతినిధి:**




అఖిల భారత ఔషధ వ్యాపారుల సంఘం పిలుపు మేరకు బుధవారం పరకాల పట్టణంలో మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకాలను నిరసిస్తూ చేపట్టిన ఈ బంద్ కు పట్టణంలోని మెడికల్ షాపులు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపాయి. బంద్ విషయం తెలియని కొంతమంది వినియోగదారులు మెడికల్ షాపుల వద్దకు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నరేందర్ గౌడ్

**వేద న్యూస్, పాపన్నపేట:**



పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నరేందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హన్మంత్ గౌడ్‌లకు నరేందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. మండలంలో గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం మే 21 , 2026

# రైతులకు తాగునీరు, నీడ కల్పించాలి

- కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి
- వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

**వేద న్యూస్, ఇందల్వాయి:**



మండల కేంద్రంలోని ఇందల్వాయి వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ జి. బాలయ్య, జీపీవో ప్రమోద్ సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన అధికారులు కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరిగిందని, కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రైతులకు నిరంతరం తాగునీటి సౌకర్యంతో పాటు ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి మాఫియాకు ఎమ్మెల్యే అండదండలు

- చెరువులను ధ్వంసం చేస్తున్నారు - మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**వేద న్యూస్, గంగాధర:**



చొప్పదండి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే అండదండలతోనే మట్టి మాఫియా యథేచ్ఛగా చెరువులను ధ్వంసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి గంగాధర మండలంలోని కురిక్యాల చెరువును సందర్శించిన ఆయన, రామడుగు, గంగాధర, చొప్పదండి, బోయినిపల్లి మండలాల్లో చెరువుల పరిరక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఇరిగేషన్, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మట్టి మాఫియా ధనార్జనే లక్ష్యంగా చెరువులను అడ్డగోలుగా తవ్వేస్తోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అధికారుల సహకారంతోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని ప్రజల్లో తీవ్ర ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయని ఇటీవల కాంగ్రెస్ నాయకులే లారీలకు అడ్డంగా పడుకున్న ఘటనలను గుర్తు చేశారు. ముందస్తుగా ముడుపులు ఇచ్చి ఒకటి రెండు రోజుల్లోనే చెరువులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని, గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించేలోపే నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# హెరిటేజ్ వాక్ విజయం

- ఖమ్మం ఖిల్లా చరిత్రపై అవగాహన
- పర్యాటక అభివృద్ధికి ప్రజల మద్దతు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**




జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ ఘన విజయవంతమైందని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మే 18 నుంచి 23 వరకు జరుగుతున్న పర్యాటక ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం మెట్ల నుంచి జాఫర్ బావి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెరిటేజ్ వాక్ ద్వారా ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, పర్యాటక అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని సునీల్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సహాయ ఇంజనీర్ నరేష్ నాయక్, పర్యాటక శాఖ సిబ్బంది చంద్రశేఖర్ ఆజాద్, హెరిటేజ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

# లారీలో భారీ అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. పూర్తిగా దగ్ధమైన లారీ
- డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రాణాపాయం

**వేద న్యూస్, పెద్దపల్లి ప్రతినిధి:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ శివారులో బుధవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్న లారీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. లారీ క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. క్షణాల్లోనే మంటలు లారీ అంతటా వ్యాపించడంతో వాహనం పూర్తిగా కాలిబూడిదైంది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే లారీ నుంచి కిందకు దూకేయడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం కారణంగా కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆల్ ఇండియా మెడికల్ షాపుల బంద్ విజయవంతం

- ఈ-ఫార్మసీలకు వ్యతిరేకంగా నిరసన

**వేద న్యూస్, కోనరావుపేట:**




దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన మెడికల్ షాపుల బంద్‌కు మద్దతుగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ షాపులు బుధవారం స్వచ్ఛందంగా మూసివేశారు. దీంతో పలు ప్రాంతాల్లో మెడికల్ దుకాణాలు బంద్ కావడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ షాప్ యజమానుల సంఘం అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ ఈ-ఫార్మసీలు, భారీ డిస్కౌంట్ విధానాల వల్ల చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు చిన్న వ్యాపారుల జీవనోపాధి కాపాడేందుకే ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ-ఫార్మసీలకు అనుకూలంగా తీసుకొచ్చిన నోటిఫికేషన్లను రద్దు చేసి చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఇందల్వాయి పెద్ద చెరువు కబ్జా స్థలాల పరిశీలన

- త్వరలో రైతులకు నోటీసులు జారీ
- సహకరించాలని గ్రామస్తులకు అధికారుల విజ్ఞప్తి

**వేద న్యూస్, ఇందల్వాయి:**



మండల కేంద్రంలోని ఇందల్వాయి పెద్ద చెరువు కబ్జాకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లోకాని గంగామణి, గంగారాం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి చెరువు పరివాహక ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువుకు ఆనుకొని ఉన్న రైతులందరికీ త్వరలోనే అధికారిక నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం రైతుల సమక్షంలో పారదర్శకంగా భూ సర్వే నిర్వహించి చెరువు సరిహద్దులను శాశ్వతంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగే సర్వేకు రైతులు, గ్రామస్తులు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల మృతి

- ఆటలాడుకుంటూ వెళ్లి ప్రమాదానికి గురి
- జగిత్యాల జిల్లా కొండపూర్ లో విషాదం

**వేద న్యూస్, మేడిపల్లి:**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామంలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కొండపూర్ గ్రామానికి చెందిన మనవిత్ (10), మనస్విని (9), షర్విండ్ (7) సాయంత్రం సమయంలో ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు వద్దకు చేరుకున్న వారు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. కోనేరు లోతు ఎక్కువగా ఉండటంతో చిన్నారులు బయటకు రాలేక నీటిలోనే ప్రాణాలు కోల్పోయారు. పిల్లలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒక్కసారిగా ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.

# సెల్ టవర్ తొలగించాలంటూ ఆందోళన

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ నగరంలోని 39వ డివిజన్ శాఖరాసి కుంట ఏకశిల కాలనీ వద్ద గత 18 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన సెల్ టవర్ ను తొలగించాలంటూ స్థానిక మహిళలు గృహవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ టవర్ వల్ల రేడియేషన్ ఎక్కువై స్థానిక ప్రజలు రోగాల పాలవుతున్నారని, చాలామంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. వెంటనే సెల్ టవర్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో చాలాసార్లు ఫిర్యాదు కూడా చేశామని అయినా కూడా ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సెల్ టవర్ వద్ద జనరేటరు, బ్యాటరీలు ఇతర పరికరాలను అమర్చడానికి తీసుకురావడంతో వాటిని స్థానికులు అడ్డుకున్నారు. సెల్ టవర్ తీసేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వంచనగిరి కిషోర్, స్వప్న, కనుకుంట్ల కమటం వేణుగోపాల్, శ్రీమన్నారాయణ, గన్నోజు ప్రవీణ్, దేవులపల్లి నీలా, రావుల శ్రీనివాస్, స్రవంతి, భాగ్యలక్ష్మి, ఎండి అంజద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

- రూ.40 వేల నగదు, వాహనాలు, కోడిపుంజులు స్వాధీనం
- మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవు: డీసీపీ రామ్‌రెడ్డి

**వేద న్యూస్, పెద్దపల్లి:**



కోడిపందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మూగజీవాలను హింసించడం చట్టరీత్యా నేరమని పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులోని బోడా గుట్ట వద్ద రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మూడు రోజుల పాటు రెక్కీ నిర్వహించి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పందాలు కాస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.40 వేల నగదు, ఒక కారు, ఏడు ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లు, ఆరు కోడిపుంజులు, ఆరు పందెం కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని, ఎక్కడైనా ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక నగదు రివార్డులు అందజేయనున్నట్లు డీసీపీ ప్రకటించారు.

వేద న్యూస్

గురువారం మే 21 , 2026

# తెలంగాణలో టీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

## - టీఆర్ఎస్ నాయకులు సుశీల్ గౌడ్



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని టీఆర్ఎస్ నాయకులు సుశీల్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి కవిత చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుశీల్ గౌడ్ మాట్లాడుతూ కవితక్క చేతుల మీదుగా టీఆర్ఎస్ కండువా కప్పుకోవడం ఎంతో గౌరవంగా ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర శ్రేయస్సు కోసం, సర్వోదయ తెలంగాణ నిర్మాణం కోసం, బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ మరియు అన్ని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, అలాగే మహిళా సాధికారత లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీలో పనిచేయడం తనకి మరింత బలాన్ని, బాధ్యతను ఇస్తుందన్నారు.ప్రజల ఆశయాల సాధన కోసం అంకితభావంతో ముందుకు సాగుతనన్నారు.

# ప్రభుత్వ నేత్ర వైద్య ఆసుపత్రికి మహర్దశ

## - 100 పడకలకు విస్తరణ, రూ.1.73 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజ్ రిటైర్డ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం మంత్రి కొండా సురేఖ చేశారు. వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలందించడమే కాకుండా, ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. సిబ్బంది కొరత లేకుండా, అవసరమైన వైద్య పరికరాలను వెంటనే అందుబాటులోకి తెంచేందుకు కృషి చేస్తాం అని మంత్రి పేర్కొన్నారు. వరంగల్ చుట్టుపక్కల జిల్లాల వారికి ఈ ఆసుపత్రి కేరాఫ్ అడ్రస్‌గా మారాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఏజెన్సీ ద్వారా రిక్రూట్మెంట్ అయినా వర్కర్స్ విధినిర్వహణలో ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని, విధులకు భంగం కల్పించకుండా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించుటకు వైద్య అధికారులు ముందుండాలని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఫ్రీ బస్సు వలన సుధీర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించాలని, ఎవ్వరికీ అదనంగా డబ్బులు ఇవ్వరాదని బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సికేం ఆస్పత్రి అభివృద్ధి లో భాగంగా వారు మాట్లాడుతూ నవ మాసాలు మోసిన తల్లికి బిడ్డ దక్కకపోతే ఆ తల్లి భాద వర్ణనాతీతమని, ప్రతి ఒక్క గర్భిణి అయినా ప్రతి మహిళ పుట్టింటి నుండి సాగనంపినట్లు గా 108 వాహనం ద్వారా ఆసుపత్రి నుండి వారి ఇంటికి చేర్చాలని ఈసందర్భంగా సి.ఎం సూపర్డెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అడ్మిన్ కమిటి మెంబెర్స్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైబి గణేష్, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, డి ఎస్ డి ఓ భాగ్యలక్ష్మి, ఇరిగేషన్ ఈ సునీత, ఎంజీఎం సూపర్డెంట్. హరిచంద్ర రెడ్డి, డాక్టర్ జి ఆర్ భరత్ కుమార్, డాక్టర్ కేబి చంద్ర భాను, డాక్టర్ వి శ్రీకుమార్, డాక్టర్ విజయ్ శ్రీ, డాక్టర్ వంశీ ప్రియ, డాక్టర్ చరణ్, డాక్టర్ శరత్, డాక్టర్ సంధ్యారాణి మరియు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ఓటీటీలోకి వచ్చిన 'సతీ లీలావతి'




**వేద న్యూస్ డెస్క్:**

సతీ లీలావతి చిత్రం థియేటర్లలో విడుదలైన కొద్ది రోజులకే ఓటీటీ బాట పట్టింది. మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల ప్రధాన పాత్రలో నటించిన ఈ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మే 8న ప్రేక్షకుల ముందుకు వచ్చిందిగానీ, ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో విడుదలైన కేవలం 12 రోజుల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకువచ్చారు. దేవ్ మోహన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. వేదికలపై మే 20 నుంచి ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. సినిమా కథలో లీలావతి పాత్రలో లావణ్య త్రిపాఠి కనిపించగా, రామ్ సేతు పాత్రలో దేవ్ మోహన్ నటించాడు. చిన్ననాటి మానసిక భయాలతో బాధపడుతున్న లీలావతికి సైకాలజిస్ట్ రామ్ సేతు అండగా నిలుస్తాడు. ఆ పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ పెళ్లి చేసుకుంటారు. అయితే వివాహం జరిగిన కొన్నేళ్ల తర్వాత తాను మరో అమ్మాయిని ప్రేమిస్తున్నానని చెప్పి విడాకులు కోరడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. అనంతరం వారి జీవితాల్లో చోటుచేసుకునే పరిణామాలే సినిమా ప్రధానాంశంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్, నరేశ్ వికె, వీటీవీ గణేశ్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని మిక్కీ జే మేయర్ అందించగా, దుర్గాదేవి పిక్చర్స్ పతాకంపై ఎం. నాగ మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.

# 'డ్రాగన్' గ్లింప్స్‌తో తారక్ సంచలనం




**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ ఎట్టకేలకు బయటకు వచ్చింది. సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్ కొత్త చిత్రానికి డ్రాగన్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్ర బృందం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో వైరల్ అవుతోంది. సుమారు నాలుగు నిమిషాలకుపైగా నిడివి ఉన్న ఈ గ్లింప్స్‌లో ప్రశాంత్ నీల్ తన ప్రత్యేకమైన డార్క్ విజువల్ శైలిని మరోసారి చూపించాడు. 1967 కాలం నాటి అంతర్జాతీయ ఓపియం వ్యాపారం, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే క్రూరమైన మాఫియా ప్రపంచాన్ని ఇందులో ఆవిష్కరించారు. హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, చివర్లో ఎన్టీఆర్ పాత్రను అత్యంత పవర్‌ఫుల్‌గా ఎంట్రీ చేయించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ 'లూగర్' అనే భయంకరమైన హంతకుడి పాత్రలో కనిపించనున్నాడు. 'ఆఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీ'కి ప్రధాన హంతకుడిగా ఆయన పాత్రను డిజైన్ చేసినట్లు గ్లింప్స్‌లో స్పష్టమైంది. రఫ్ అండ్ లీన్ లుక్‌లో కనిపించిన ఎన్టీఆర్ మాస్ అవతార్ అభిమానులకు విపరీతమైన ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా "దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం" అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో భారీగా ట్రెండ్ అవుతోంది. శవాల గుట్టపై నిలబడి కనిపించిన తారక్ విజువల్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రశాంత్ నీల్ రూపొందించిన ఈ కొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ పాత్రను పూర్తిస్థాయి ఊరమాస్ బీస్ట్ మోడ్‌లో చూపించినట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో అధికారి రఘువీర్ రాథోడ్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ అందించిన నేపథ్య సంగీతం, సినిమాటోగ్రాఫర్ భువన్ గౌడ విజువల్స్ గ్లింప్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# మనోజ్ ఎంట్రీతో బాలయ్య సినిమాపై భారీ అంచనాలు

**వేద న్యూస్ డెస్క్:**




'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో నటుడు మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని దర్శకుడు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడిస్తూ, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని తెలిపాడు. థియేటర్లలో ఆ పాత్ర ప్రభావాన్ని ప్రేక్షకులు ఆస్వాదించే క్షణాల కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నాడు. ఈ చిత్రంలో మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ ఒకే తెరపై కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేయనున్నట్లు సమాచారం. ఆయన సరసన కథానాయికగా నయనతార నటిస్తోంది. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' తర్వాత బాలకృష్ణనయనతార జోడీ కలిసి నటిస్తున్న నాలుగో చిత్రం కావడంతో ఈ కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎస్.ఎస్. తమన్ అందిస్తుండగా, వృద్ధి సినిమాస్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. యాక్షన్, భావోద్వేగాలు, పవర్‌ఫుల్ పాత్రల సమ్మేళనంగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం.

# క్రికెటర్‌తో ప్రేమలో ఉందా..?

## శ్రీదేవి అప్పాలపై వైరల్ అవుతున్న రూమర్లు

**వేద న్యూస్ డెస్క్:**



'కోర్టు' సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న యువ నటి శ్రీదేవి అప్పాల ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఆ చిత్రంలో 'జాబిలి' పాత్రలో ఆమె చూపించిన అమాయకమైన నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. సినిమా కూడా భారీ విజయాన్ని అందుకుని రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో శ్రీదేవి అప్పాల క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. అదే జోష్‌లో ఇటీవల 'బ్యాండ్ మేళం' అనే యూత్‌ఫుల్ లవ్ స్టోరీతో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో కూడా 'కోర్టు' హీరో హర్ష్ రోషన్తో కలిసి నటించింది. సినిమా

ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, శ్రీదేవి నటనకు మాత్రం మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఆమె తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు సినిమాల్లో నటిస్తోంది. అందులో 'హైకు' అనే క్రేజీ ప్రాజెక్ట్ కూడా ఒకటి. తమిళ, మలయాళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోగా ఏగన్ నటిస్తుండగా, 'మిన్నల్ మురళి' ఫేమ్ ఫెమినా జార్జ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలతో కూడా శ్రీదేవి అప్పాల తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో తనతో కలిసి నటించిన హర్ష్ రోషన్‌తో ప్రేమలో ఉందంటూ వార్తలు వచ్చాయి. అయితే అవన్నీ కేవలం పుకార్లేనని ఆమె స్పష్టం చేసింది. ఇప్పుడు మరోసారి ఓ యువ భారత క్రికెటర్‌తో ఆమె ప్రేమలో ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో రాణిస్తున్న ఓ యువ ఆటగాడితో ఆమె పేరును ముడిపెడుతూ కొన్ని పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. కొందరు కావాలనే సోషల్ మీడియాలో ఈ తరహా రూమర్లు సృష్టిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీదేవి అప్పాల మాత్రం తన పూర్తి దృష్టిని సినిమాలపైనే పెట్టినట్లు సమాచారం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073